గంభీరావుపేట : వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు



ఎల్లారెడ్డిపేట : బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌పై కన్నెర్ర

- సన్నవడ్లకే బోనస్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం
- కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

రాజన్న సిరిసిల్ల, మే 21 (నమస్తే తెలంగాణ) : ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమేనన్న కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ మండిపడింది. అన్నదాతకు నేనున్నానంటూ అండగా నిలిచింది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డుల వద్ద ధర్నాలు చేపట్టింది. సిరిసిల్ల అర్బన్ మండలం సర్దాపూర్‌లోని మార్కెట్ యార్డు వద్ద బీఆర్ఎస్ జిల్లా, పట్టణాధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా తోట ఆగయ్య, జిందం చక్రపాణి మాట్లాడుతూ, ఎద్దేడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం నిలబడదని హెచ్చరించారు. వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సన్న వడ్లకంటూ మాట మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదని, ప్రజావ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రతి గింజకూ బోనస్ అని ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇపుడు మాట మారుస్తూ రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్నారన్నారు. నిన్నటిదాకా సాగునీరివ్వక సావగొట్టిందని, కరెంటు కోతలతో పంటలను ఎండగొట్టి, కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాల పాలు చేసిందంటూ మండిపడ్డారు. ప్రతి పంటకూ రైతు, కౌలు రైతుకూ రూ.15వేలు రైతు భరోసా ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇప్పటి వరకు ఇవ్వలేదని, అధికారంలోకి ఆరునెలలు గడిచినా ఇంత వరకు రైతుల సమస్యలు తీర్చలేదన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ అని నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు క్షమించరన్నారు. ఓట్లనాడు ఒక మాట, నాట్లనాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజమని విమర్శించారు. నమ్మి ఓటేసినందుకు గోస పడుతున్న అన్నదాతలు పల్లెపల్లెలో కాంగ్రెస్ విధానాలను ఎండ గడుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మ్యాన రవి, మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ మానస, మాజీ ఏఎంసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎరవెల్లి రమణారావు, గాజుల బాలయ్య, అందె సుభాష్, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్ మండలం సర్దాపూర్‌లోని మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 21: రూ.5 వందల బోనస్‌ను అన్ని రకాల వరి ధాన్యానికి వర్తింపజేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. మ్యానిపెస్టోలో వరికి మద్దతు ధర ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నాలకే వర్తింపజేస్తామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, ఎంపీపీ పిల్లి రేణుక, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, ఎన్గందుల అనసూయ, అప్సరు న్నీసా తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట, మే 21: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ధర్నా చేశారు. శాసన సభ ఎన్నికల సమయంలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కొర్రీలు పెట్టడం తగదని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్లకు వర్గాలు పెట్టి దొడ్డు, సన్నరకం అంటూ బోనస్ పేరిట బోగస్ హామీలు ఇచ్చిన మిమ్ములకు రానున్న రోజుల్లో రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, పెద్దవేని వెంకటియాదవ్, గంధ్యాడపు రాజు, గొగు లింగంయాదవ్, చెవుల మల్లేశం, గడ్డి హరీశ్, రాజు, ఎగదండి స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మీను, కిషన్‌రావు, రవి, రైతులు ఉన్నారు.

వీర్నపల్లి, మే 21: పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే సన్న వడ్లకు మాత్రమే క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులవి భోగస్ మాటలేనని మరోసారి నిరుపితమైందని జడ్పీటీసీ గుగులోత్ కళావతి మండిపడ్డారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను నిరసిస్తూ ధర్నా నిర్వహించగా, ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో రైతులు దొడ్డు వడ్లను మాత్రమే పండిస్తారన్నారు. ప్రస్తుతం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ సురేశ్‌నాయక్, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు గుగులోత్ కళ, నేతలు శ్రీరాంనాయక్, భాస్కర్, రవి, నాగరాజు, సతీశ్, తులసీరాం, గజన్ ఉన్నారు.

ముస్తాబాద్, మే 21 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రావు, గూడూరి భరత్, చెవుల మల్లేశ్‌యాదవ్, సర్వర్‌పాషా, మనోహర్, ఎల్లం, బాలయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, బాలయ్య, స్వామి, జాంగీర్,రాజు, నందు, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్ : పోతుగల్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రోడ్లపైనే ధాన్యపు రాశులు

- తరుచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు
- వడ్లు ఎండినా.. కొనుగోళ్లలో ఆలస్యం

రాజన్నపేట–గొల్లపల్లి ప్రధాన రహదారిపై పోసిన ధాన్యం కుప్పలు

ఊరూరా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెలన్నర దాటినప్పటికీ.. అనుకున్న స్థాయిలో కొనుగోళ్లు చేపట్టడం లేదు. కొందరు రైతులు దళారులకు ధాన్యం అమ్ముకోగా, మరికొందరు మద్దతు ధరపై ఆశతో కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ధాన్యం ఎండి మ్యాచర్ రావడంతో రోడ్ల పైనే కుప్ప పోశారు. రాత్రివేళలో రోడ్లపై వెళ్లే వాహనదారులకు ధాన్యపురాశులు ప్రాణసంకటంగా మారాయి. చీకట్లో సరిగ్గా కనిపించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం కావడంతోనే ప్రమాదాలు అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో కోమాలో ఉండి చికిత్స పొందుతున్న సుబ్బారావు

ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న రాములు

ఎల్లారెడ్డిపేట, మే 21 : పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలదాటింది. అనుకున్న స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు దళారులను ఆశ్రయిస్తున్నారు. తక్కువ ధరకే ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. మరికొందరు రైతులు ధాన్యాన్ని ఆరబోసి, పూర్తిగా ఎండినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో రోడ్లపైనే కుప్పలుగా పోస్తున్నారు. దీంతో ప్రధానంగా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి రగుడు బైపాస్ నాలుగు లేన్ల రోడ్డు, గొల్లపల్లి–రాజన్నపేట, బొప్పాపూర్–కోరుట్లపేట, ఎల్లారెడ్డిపేట–అల్మాస్‌పూర్ ప్రధాన రహదారుల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల గొల్లపల్లిలో నివాసముంటున్న వలస కార్మికుడు సుబ్బారావు కూలీలను తన బైక్‌పై తీసుకువచ్చేందుకు రాత్రి బయలుదేరిన క్రమంలో గొల్లపల్లి శివారులో ధాన్యం కుప్పకు ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతడిని హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. రాజన్నపేటకు చెందిన ఎరుపుల రాములు గొల్లపల్లి నుంచి రాజన్నపేటకు వెళ్తుండగా ధాన్యపు కుప్పను ఢీకొట్టడంతో ముఖానికి తీవ్ర గాయాలై, దవాఖానలో చేరాడు. గతంలో పలువురు మృతి చెందినా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగం

వేములవాడ రూరల్, మే 21: వేములవాడ మండలం రుద్రవరంలో గౌడ కుల స్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ సిద్ధోగాన్ని నిర్వహించారు. ఇక్కడ గౌడ కుల స్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

రుద్రంగి, మే 21: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులున్నారు.

యూనిఫాంను రెడీ చేయాలి

ఇల్లంతకుంట, మే 21 : మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫాంను త్వరగా అందించాలని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కందికట్కూర్, గాలిపెల్లిలోని ఆదర్శ జీవన జ్యోతి గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలోని స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫాం ఇవ్వాలని మొదటి జత జూన్ 10 వరకు ఇవ్వాలని, రెండో జత తదుపరి నెలాఖరులో ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ఇక్కడ ఐకేపీ ఏపీఎం వాణిశ్రీ, సీసీలు రామచంద్రా రెడ్డి, వెంకటేశం, రాజేశ్వరి, వీవోఏలు, సభ్యులున్నారు.

ట్రాక్టర్ ఢీకొని స్తంభం ధ్వంసం

తెలంగాణ చౌక్, మే 21: సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో మంగళవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యుత్తు స్తంభం ధ్వంసమైంది. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల మేరకు, ఇసుక ట్రాక్టర్ అతివేగంతో వచ్చి రోడ్డు పక్కన కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్తు వైర్ల తాకిడికి మంటలు చెలరేగి మరో రెండు స్తంభాలు పడిపోయినట్లు తెలిపారు. అధికారులు వాహనాలను వేగానికి అడ్డుకట్ట వేసి ప్రమాదాలు జరుకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ రూరల్, మే 21: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామానికి చెందిన వస్తం శ్రీనివాస్ అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరించి ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ప్రభుత్వం పంపిణీ బియ్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటుమని హెచ్చరించారు. అనంతరం ఆటోను సీజ్ చేసి శ్రీనివాస్ పై కేసు నమోదు చేశామన్నారు.

సెలవుపై ఆలయ ఈవో

వేములవాడ, మే 21: వేములవాడ రాజన్న ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ ప్రసాద్ అనారోగ్య కారణాలతో రాష్ట్ర దేవాదాయ శాఖాధికారులను సెలవు కోరగా సోమవారం మంజూరు చేసినట్లు తెలిసింది. మే 27 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఆయన శస్త్రచికిత్సల నిమిత్తం సెలవుపై వెళ్లనున్నారు. 12 రోజులపాటు ఈవో సెలవుపై వెళ్లనుండడంతో ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణా రావును కేటాయిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు.

బీరప్ప ఉత్సవాలు

కోనరావుపేట, మే 21: సుద్దాలలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాలకు మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ హాజరై ఆలయంలో పూజలు చేశారు. ఇక్కడ ఎంపీటీసీ మమత, సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్‌యాదవ్, శ్రీనివాస్ ఉన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

సిరిసిల్ల ఏరియా దవాఖానలో గాయపడిన మహిళా కూలీని పరామర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, మే 21: మట్టి పెల్లలు కూలి సిరిసిల్ల ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కాంగ్రెస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డితోపాటు పలువురు వేర్వేరుగా పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ అన్నపూర్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేవయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు రాంచంద్రం, సింగిల్ విండోడైరెక్టర్ సత్తయ్య, మాజీ సర్పంచ్ మంతెన సంతోష్, పీడీ శేషాద్రి, ఆర్డీవో రమేశ్, తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, ఎంపీడీవో శశికళ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ పరామర్శించారు. రాజవ్వ కుటుంబానికి ప్రభుత్వం ₹25లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు గాయాలైన ఒక్కొక్కరికి ₹5లక్షలు ఇవ్వాలని మాజీ సర్పంచ్ సంతోష్ కోరారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు విమల

రాజన్న సిరిసిల్ల నమస్తే తెలంగాణ : ఉపాధి పనిలో భాగంగా మట్టి పెల్లలు కూలి మృతి చెందిన మారుపాక రాజవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జవ్వాజి విమల డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో మరణించిన కార్మికురాలు మారుపాక రాజవ్వకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడ్డ కూలీలకు మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనుల వద్ద సరైన భద్రతా చర్యలు తీసుకోక పోవడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో కార్యదర్శి సూరం పద్మ ఉన్నారు.

బాధిత మహిళకు ఆర్థిక సాయం



మానాలలో బీకొండ లక్ష్మికి రూ.10వేల నిత్యావసర సరుకులు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి, మే 21: మానాల గ్రామానికి చెందిన దీకొండ గంగనర్సయ్య తల్లి లక్ష్మి ఇల్లు ఇటీవల కురిసిన కూలిపోగా, ఆర్థిక ఇబ్బందులతో సతమతమతున్నది. దీంతో లక్ష్మికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆర్థిక సహాయంతోపాటు నిత్యావసర సరకులు అందించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో రూ.10 వేల ఆర్థిక సాయంతోపాటు సరుకులు అందించామని నాయకులు పేర్కొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి, కమ్మర్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ బాదనవేణి రాజారాం, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు నాయిని రాజేశం, నాయకులు గజన్‌లాల్, సుందర్‌నాయక్, లక్కాకుల రమేశ్, అంజయ్య, లస్మయ్య, శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ప్రజా రక్షణే పోలీసుల ధ్యేయం

కోనరావుపేట, మే 21: ప్రజా రక్షణే పోలీసుల ధ్యేయంగా ముందుకుసాగుతున్నామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. నిజామాబాద్ గ్రామంలో పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని ఎస్ఐ ఆంజనేయులు నిర్వహించగా హాజరై మాట్లాడారు. గ్రామాలలో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

వేములవాడ రూరల్, మే 21: నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాలు చాలా కీలకంగా పనిచేస్తాయని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లిలో ఎస్ఐ మారుతితో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఇక్కడ మాజీ సర్పంచులు శ్రీనివాస్, చంద్రయ్య, ఎంపీటీసీ శంకరవ్వరాములు, ప్రభాకర్, మల్లేశం, రమేశ్, తిరుపతి, నాగరాజులున్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

బీజేపీ కార్యాలయంలో దీక్ష చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు

వేములవాడ, మే 21: రైతులకు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం వేములవాడ బీజేపీ కార్యాలయంలో రైతన్న కోసం బీజేపీ రణభేరి పేరిట దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకే 500 మద్దతు ధర అంటూ ప్రకటిస్తూ రుణమాఫీని వాయిదాలు వేస్తున్నదని పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా బీజేపీ కిసాన్ సెల్ మోర్చా అధ్యక్షుడు కృష్ణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణాధ్యక్షుడు కౌన్సిలర్ సంతోష్ బాబు, సంటి మహేశ్, వెంకటేశ్, తదితరులున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ, పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

రాజన్న సిరిసిల్ల, మే 21 (నమస్తే తెలంగాణ): పాలిసెట్, ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు, పాలిసెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షా కేంద్రాలను శుభ్రం చేయాలని, విద్యార్థుకు తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ఎండల నేపథ్యంలో వైద్య సిబ్బందితో పాటు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఇంటర్ మొదటి సంవత్సరం లో 2,222 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో 1,412 మంది రాయనున్నట్లు చెప్పారు. పాలిసెట్ నిర్వహణకు 7 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. 1,645 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరు కానున్నారు. సమావేశంలో డీఈఐవో మోహన్, డీఈవో రమేశ్, డీఎంహెచ్‌వో సుమన్, ఎస్ఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ పాల్గొన్నారు.

ధాన్యం త్వరితగతిన అన్‌లోడింగ్ చేయాలి

కలెక్టరేట్, మే 21 : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ధాన్యం సేకరణ, సీఎంఆర్ డెలివరీపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటిదాకా 33,667 మంది రైతుల నుంచి 2,24,253 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 387 కోట్ల డబ్బులు జమ చేశామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సకాలంలో ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులకు కొరత లేదు

కలెక్టరేట్, మే 21: ఖరీఫ్ సీజన్ సాగుకోసం జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు కొరత లేదని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఖరీఫ్ సీజన్ సాగుపై వ్యవసాయ అధికారులు, పోలీసులు, డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. ఖరీఫ్‌లో జిల్లాలో వరి 1,82,000 ఎకరాలు, 50 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. పోలీసులు, వ్యవసాయ అధికారులు, దుకాణాల డీలర్లు కలిసి వీటిని అరికట్టాలని సూచించారు. అనంతరం డీలర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, మార్క్ ఫెడ్ డీఎం దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

గంభీరావుపేట, మే 21: నాగంపేట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా నృసింహస్వామి కల్యాణాన్ని జరిపించారు. మహిళలు మంగళహారతులతో స్వామి వార్లకు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులున్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి

బోయినపల్లి, మే 21: పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని జడ్పీసీఈవో ఉమారాణి ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. మంగళవారం బోయినపల్లి, దేశాయిపల్లి, జగ్గారావుపల్లి, వరదవెల్లి, తడగొండ, మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో జయశీల, ఎంపీవో గంగాతిలక్, కార్యదర్శులున్నారు.

బద్దిపోచమ్మకు ఘనంగా బోనాలు

అమ్మవారికి బోనం సమర్పించడానికి క్యూలో భక్తులు

వేములవాడ టౌన్, మే 21 : రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్దిపోచమ్మకు భక్తులు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారికి కల్లుపోసి, సారె పెట్టి బోనాలు సమర్పించ